క్లుప్తంగా

మున్నూరుకాపు కార్యవర్గం



ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గం

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని బ్రహ్మపురి మున్నూరుకాపు సంఘ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఆ సంఘ భవనంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జాప నారాయణ, ఉపాధ్యక్షుడిగా పోశెట్టి, ప్రధాన కార్యదర్శిగా మిరియాల సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శిగా జాప అనిల్, కోశాధికారిగా జాప శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులుగా జాప శ్రీనివాస్, జాప శ్రీధర్, ఆకుల రామకృష్ణ, జాప నరేందర్, జాప చంద్రశేఖర్, ఆకుల నవీన్ ఎన్నికయ్యారు. జాప విజయ్‌కుమార్, దొంతుల చంద్రశేఖర్, జాప కాశీనాథ్, బాసవేణి సత్తయ్య ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. ఈసందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను పలువురు శాలువా, పూలమాలతో సత్కరించారు.

జవాన్‌కు సన్మానం



గణేశ్‌ను సన్మానిస్తున్న కాలనీవాసులు

ఖానాపూర్: సీఆర్‌పీఎఫ్ జవాన్‌గా ఎంపికై శిక్షణ ముగించుకుని స్వగ్రామానికి వచ్చిన పట్టణంలోని అంబేద్కర్‌నగర్ కాలనీకి చెందిన షెట్పెల్లి గణేశ్‌ను ఆదివారం అంబేద్కర్ నగర్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు స్వీట్లు తినిపించి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో జన్నారపు శంకర్, కుంటాల రాజన్న, గొర్రె గంగాధర్, మేదరి రాజేశ్వర్, దాసరి రాజేశ్వర్, మోహన్, సురేశ్ తదితరులు ఉన్నారు.

విరమణ చేసే ఉద్యోగులకు..



కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

సోన్: మండలంలోని కడ్తాల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్, ఎల్‌జీటీ విజయలక్ష్మి ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని ఆదివారం పాఠశాలలో నిర్వహించారు. ఈసందర్భంగా వారిని పలువురు శాలువా, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో పరమేశ్వర్, పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం రమేశ్‌బాబు, పీఆర్ జీవీటీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూమారెడ్డి, సాయికుమార్, నగేశ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో నిరసన



పుస్తకాల గదికి తాళం వేస్తున్న ఎంఈవో

నర్సాపూర్(జి): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు విక్రయిస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తున్న మండలంలోని రాంపూర్‌లో సెయింట్ థామస్ పాఠశాల ఎదుట ఆదివారం ఏబీవీపీ నాయకులు నిరసన చేపట్టారు. సమాచారం తెలిసి అక్కడకు వచ్చి అక్రమ పుస్తకాల గదులను సీజ్ చేసినట్లు ఎంఈఓ సాయన్న తెలిపారు. ఈసందర్భంగా ఏబీవీపీ ఇందూరు విభాగ్ కన్వీనర్ కైరి శశిధర్ మాట్లాడుతూ పుస్తకాలు, యూనిఫాం పేరిట విద్యను వ్యాపారంగా మారుస్తూ పేద, మధ్య తరగతి విద్యార్థుల కుటుంబాలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏబీవీపీ జిల్లా కన్వీనర్ దినేశ్, పట్టణ కార్యదర్శి సాయికుమార్, సుశాంత్, లక్ష్మిప్రసాద్, దుర్గాదాస్, సాయి, సాత్విక్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగికి విరమణ తప్పనిసరి

ఖానాపూర్: ప్రతి ఉద్యోగికి విరమణ తప్పనిసరి అని మున్సిపల్ మాజీ చైర్మన్ చిన్నం సత్యం, ఎంఈవో అంకం ప్రేమ్‌సాగర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని పీఆర్‌టీయూ భవన్‌లో సుభాష్‌నగర్ ఎంపీపీఎస్ ఉపాధ్యాయుడు గడ్డమీది రాజశేఖర్ ఉద్యోగ విరమణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. అంతకుముందు పట్టణంలోని జేకే ఫంక్షన్‌హాల్‌లో ఎస్‌బీఐ ఉద్యోగి అంబేద్‌కుమార్ ఉద్యోగ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఇరువురిని పలువురు నాయకులు శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. బెజ్జారపు మురళి, డి.శ్రీనివాస్, గంగన్న, సుధాకర్, గంగనర్సయ్య, అశోక్‌రెడ్డి, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

మీసేవ కేంద్రాల్లో దోపిడీ

ప్రజలకు ప్రభుత్వ సేవలను పారదర్శకంగా, సులభతరంగా అందించేందుకు ఏర్పాటు చేసిన మీసేవ కేంద్రాలు దోపిడీకి నిలయాలుగా మారుతున్నాయి. విద్యార్థులు, రైతులు, వివిధ వర్గాల ప్రజలు తమ అవసరాల నిమిత్తం ఆదాయ, కులం, నివాసం, భూమి తదితర పత్రాల కోసం మీసేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకుంటారు. నిర్ణీత రుసుం చెల్లించి ఆయా సర్టిఫికెట్లను మీసేవలోనే తీసుకుంటారు. ఏయే సర్టిఫికేట్‌కు ఎంత చార్జీ చెల్లించాలో మీసేవ కేంద్రంలో బోర్డు ఉంటుంది. అయినప్పటికీ కొందరు నిర్వాహకులు.. దరఖాస్తుదారుల నుంచి ప్రభుత్వం నిర్దేశించిన దానికంటే అధిక చార్జీలు వసూలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో జనం ఇబ్బంది పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అధిక చార్జీలు వసూలు చేసే మీసేవ కేంద్రాల నిర్వాహకులపై చర్యలు తీసుకొని.. నిబంధనలు అమలయ్యేలా చూడాలని వినియోగదారులు కోరుతున్నారు. – కడెం



కడెంలో మీసేవ కేంద్రం

కడెంకు చెందిన ఓ మహిళ మండలకేంద్రంలోని భవాని మీసేవా కేంద్రానికి ఆధార్ అప్‌డేట్ కోసం వెళ్లింది. నిబంధనల ప్రకారం రూ.50 తీసుకోవాల్సి ఉండగా.. రూ.200 వసూలు చేశారు. దీంతో సదరు మహిళ మీసేవ కేంద్రం నిర్వాహకుడు ఇస్లావత్ రాజేశ్‌పై చర్యలు తీసుకోవాలని ఈనెల 24న తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసింది.

- ఇష్టారీతిన చార్జీల వసూలు
- నిబంధనలను తుంగలో తొక్కుతున్న నిర్వాహకులు
- అడిగినంత ఇస్తేనే చేతికి పత్రం
- లబోదిబోమంటున్న వినియోగదారులు
- ఫిర్యాదులను పట్టించుకోని అధికారులు

మీసేవ కేంద్రాల్లో ధ్రువపత్రాల కోసం నిర్వాహకులు అధిక చార్జీలు వసూలు చేస్తున్నప్పటికీ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ ఏడాది జనవరిలో పెంబి మండల కేంద్రంలోని మీసేవ కేంద్రం నిర్వాహకుడు నరేశ్ ధ్రువపత్రాలకు అధిక చార్జీలు వసూలు చేస్తున్నారని మందపల్లి, నాగపూర్ గ్రామాల ప్రజలు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. నామమాత్రపు చర్యలతో కొద్దిరోజులకే మళ్లీ అతడు అధికారుల అండదండలతో దందా సాగిస్తున్నాడు.

రెవెన్యూ సిబ్బందితో కుమ్మక్కు..

జిల్లాలో కొన్నిచోట్ల మీ కేంద్రాల నిర్వాహకులు రెవెన్యూ సిబ్బందితో కుమ్మక్కై సర్టిఫికెట్ల(ధ్రువపత్రాల) దందాను నడిపిస్తున్నారు. రెవెన్యూ సిబ్బందికి డబ్బులు, విందులు, వినోదాలు ఏర్పాటు చేస్తుండటంతో మీసేవ కేంద్రాల నిర్వాహకులు చెప్పిన పనులు చక్కదిద్దుతున్నారు. కడెం మండలానికి చెందిన ఓ వ్యక్తి తమ కుమారుడికి కుల, నివాస, ఆదాయ ధ్రువపత్రాల కోసం మీసేవలో దరఖాస్తు చేసుకున్నాడు. త్వరగా సర్టిఫికెట్లు వచ్చేలా చూడాలని నిర్వాహకుడిని కోరగా..తొందరగా అంటే ఖర్చు అవుతుందని రూ.వెయ్యి వసూలు చేసి సర్టిఫికెట్లు అప్పగించాడు.

అడిగినంత ఇవ్వకుంటే సేవల కోసం వచ్చిన వినియోగదారుల దరఖాస్తుల్లో వివరాలను తప్పుగా నమోదు చేస్తూ ఇబ్బంది పెడుతున్నారు. మండలానికి చెందిన రమేశ్ అనే వ్యక్తి ఇటీవల పాస్‌పోర్ట్ కోసం మీసేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకోగా.. వివరాలు తప్పుగా నమోదు చేశారు. దీంతో పాస్‌పోర్ట్ కార్యాలయంలో అతని దరఖాస్తును తిరస్కరించారు. చేసేదేం లేక రమేశ్ రెండోసారి పాస్‌పోర్ట్‌కు దరఖాస్తు చేసుకున్నాడు.

అనుమతి రద్దు చేయాలి



మీసేవ కేంద్రాల్లో సర్టిఫికెట్ల దందా కొనసాగుతుంది. కొందరు అమాయకులు, నిరక్షరాస్యులను దోచుకుంటున్నారు. అధిక చార్జీలు వసూలు చేసే మీసేవ కేంద్రాల అనుమతి రద్దు చేస్తేనే ఇలాంటి ఘటనలు పునరావృతం కావు.

– సునారికారి రాజేశ్, సీపీఐ(ఎంఎల్)న్యూ డెమోక్రసీ డివిజన్ కార్యదర్శి

ఫిర్యాదు చేయండి



మీసేవ కేంద్రాల్లో అధిక చార్జీలు వసూలు చేస్తే రెవెన్యూ అధికారులకు, లేదా టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలి. మండలకేంద్రంలోని ఓ మీసేవ కేంద్రంలో అధిక చార్జీలు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదు అందింది. విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం.

– ఆర్.ప్రభాకర్, తహసీల్దార్, కడెం

నారుమడి.. యాజమాన్యం ఇలా

లక్ష్మణచాంద: వరి సాగులో అధిక దిగుబడులు సాధించడానికి నారుమడి నిర్వహణ అత్యంత కీలకమని వ్యవసాయాధికారి వసంత్‌రావు పేర్కొంటున్నారు. విత్తనాల ఎంపిక, నారుమడి తయారీ, విత్తనశుద్ధి, చీడపీడల నివారణ, పెంపకం వరకు జాగ్రత్తలు తీసుకుంటే నారు ఆరోగ్యంగా ఎదిగి తెగుళ్ల బారిన పడకుండా ఉంటుంది. నారుమడి నిర్వహణపై ఏవో పలు సూచనలు చేశారు.

విత్తనాల ఎంపిక ..

అన్నదాతలు వరిసాగుకు ప్రధానంగా నీటి వనరులు, నేల స్వభావాన్ని బట్టి నాణ్యమైన విత్తన రకాలను ఎంపిక చేసుకోవాలి. ఎంపిక చేసుకున్న విత్తనాల(దీర్ఘకాలిక, స్వల్పకాలిక) కాల పరిమితిని బట్టి నారు వేసుకోవాలి

దొడ్డు రకాలు..

కేఎన్ఎంఆర్ 118, జేజీఎల్ 24423, బతుకమ్మ(జేజీఎల్18047), ఎంటీయూ 1010.

సన్న రకాలు..

కేఎన్ఎం 1638, తెలంగాణ సోనా(ఆర్ఎన్ఆర్ 15048), సిద్ధి (డబ్ల్యూజీఎల్)తదితర రకాలను ఎంచుకోవాలి.

మండె కట్టుకొని..

- లీటర్ నీరు, 1 గ్రా.కార్బండజిమ్ కలిపిన ద్రావణంలో 24 గంటల పాటు విత్తనాలు నానబెట్టి తర్వాత మండె కట్టి మొలకలను నారుమడిలో చల్లుకోవాలి.



రాచాపూర్‌లో సాగవుతున్న వరి నారు

- తక్కువ నిద్రావస్థ(2–3 వారాలున్న) విత్తనాలకైతే లీటర్ నీటికి 63 మి.లీ, ఎక్కువ నిద్రావస్థ(4–5 వారాలున్న)విత్తనాలకైతే 100 మి.లీ గాఢ నత్రికామ్లం కలపాలి. ఆ ద్రావణంలో 24 గంటలు వడ్లను నానబెట్టి కడిగి మండె కట్టాలి.

సస్యరక్షణ చర్యలు పాటించాలి



వ్యవసాయాధికారుల సూచనలు తీసుకొని మేలురకం విత్తనాలనే ఎంపిక చేసుకోవాలి. నారుమడిలో నీరు నిల్వకుండా ఎప్పటికప్పుడు తీసివేయాలి. మడి యాజమాన్యంపై నిర్లక్ష్యం వద్దు. సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చు.

– వసంత్‌రావు, ఏవో, లక్ష్మణచాంద

విత్తన మోతాదు.

దొడ్డురకం వరి విత్తనాలు ఎకరానికి 25 కిలోలు, సన్న రకం వరి విత్తనాలు ఎకరాకు 20 కిలోలు సరిపోతుంది. అలాగే అభివృద్ధి చేసిన రకాలు ఎకరానికి 15 కిలోలు, అధిగ దిగుబడులనిచ్చే రకాలు ఎకరాకు 6 కిలోలు సరిపోతాయి.

నారు పెంపకం..

1. నారుమడి బాగా దున్ని 2–3 సార్లు దమ్ము చేసి చదును చేయాలి. కాల్వలు ఏర్పాటు చేసుకోవాలి. ఎత్తు మడులను తయారు చేసుకోవడం ఉత్తమం.
2. రెండు గుంటల మడిలో విత్తనం చల్లే ముందు దుక్కిలో కిలో నత్రజని చల్లాలి. మరో కిలో విత్తనం వేసిన తర్వాత వేయాలి. కిలో భాస్వరం, కిలో పొటాష్ ఇచ్చే ఎరువులు, పశువుల పేడ వేసుకోవాలి.
3. మొలకలు వచ్చాక వారం రోజుల వరకు ఆరు తడులుగా నీటిని అందించాలి.
4. జింకు లోప నివారణకు లీటర్ నీటికి 2 గ్రా. జింకు సల్ఫేట్ కలిపి పిచికారీ చేయాలి.
5. నారుమడిలో ఇనుప ధాతువు లోపం గమనిస్తే నారు వయసును బట్టి అన్నభేది 0.5 నుంచి 1 గ్రా. నిమ్మ ఉప్పు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.
6. నారు తీసే ఏడు రోజుల ముందు గుంట నారుమడికి 400 గ్రా.కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు, ఇసుకతో కలిపి చల్లి పలుచగా నీరు అందించాలి.
7. నారుమడిలో కలుపు మొక్కల నివారణకు బ్యూటాక్లోర్ లేదా పెటిలాక్లోర్ ఎకరాకు సరిపడా నీరు కలిపి నాటు వేశాక 8 నుంచి 10 రోజులకు పిచికారీ చేయాలి.

‘వ్యక్తిత్వ హననం సరికాదు’

భైంసాటౌన్: ఫోన్ ట్యాపింగ్ కేసులో కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ లక్ష్యంగా విచారణ పేరిట ఇబ్బందులకు గురిచేస్తుందని పార్టీ ముథోల్ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ కిరణ్ కుమార్ కొమ్రేవార్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు గాలికొదిలేసి.. కేటీఆర్, హరీశ్‌రావుతోపాటు బీఆర్ఎస్ ముఖ్య నాయకులను కేసుల పేరుతో ఇబ్బంది పెడుతోందన్నారు. బీఆర్ఎస్‌కు ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూసి కాంగ్రెస్ ఓర్వలేకపోతుందన్నారు. అధికారులు సైతం ఏకపక్షంగా వ్యవహరించడం సరి కాదని పేర్కొన్నారు.

నియోజకవర్గంలోని ఆలయాలకు నిధులు

- ఏలేటి మహేశ్వర్ రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: నియోజకవర్గంలోని 9 ఆలయాలకు 1కోటి 8లక్షల రూపాయలు మంజూరు చేసినట్లు నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సారంగపూర్ మండలం రాజేశ్వర్ తండాలో జగదాంబ సేవాలాల్ ఆలయ నిర్మాణానికి రూ.12 లక్షలు, సారంగపూర్ మండలం రవీంద్రనగర్‌తండాలో జగదాంబ సేవాలాల్ ఆలయ నిర్మాణానికి రూ.12 లక్షలు, మామడ మండలం గాయద్‌పల్లిలో హనుమాన్ ఆలయ నిర్మాణానికి రూ.12లక్షలు, నిర్మల్‌రూరల్ మండలం ముజ్గి గ్రామంలో భీమన్న ఆలయ నిర్మాణానికి రూ.12లక్షలు, మామడ మండలం బూరుగుపల్లి గ్రామంలో హనుమాన్ ఆలయ నిర్మాణానికి రూ.12 లక్షలు, నిర్మల్ పట్టణంలోని నాగేశ్వరవాడ ఆలయ అభివృద్ధికి రూ.12లక్షలు, మామడ మండలం చెరువు ముందు తండాలో సేవాలాల్ ఆలయ నిర్మాణానికి రూ.12లక్షలు, నిర్మల్ పట్టణంలోని కాల్వగడ్డ, గాంధీచౌక్ దగ్గరలో శివాలయ (అదనపు) నిర్మాణ పనులకు రూ.12 లక్షలు, సారంగపూర్ మండలం రాంసింగ్‌తండాలో జగదాంబ సేవాలాల్ ఆలయ ప్రాంగణంలో కాంపౌండ్ నిర్మాణానికి రూ.12లక్షలు మంజూరైనట్లు తెలిపారు.

రమేశ్ రాథోడ్ సేవలు మరువలేనివి

ఖానాపూర్: ఉమ్మడి జిల్లాతోపాటు నియోజకవర్గానికి మాజీ ఎంపీ రమేశ్ రాథోడ్ అందించిన సేవలు మరువలేనివని పలువురు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని జగన్నాథ్‌రావు చౌరస్తాలో రమేశ్ రాథోడ్ ప్రథమ వర్ధంతిని బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల శ్రీనివాస్, అంకం మహేందర్, పుప్పాల ఉపేందర్, కీర్తి మనోజ్, రవీందర్‌రెడ్డి, రమేశ్, శ్రీనివాస్, సురేందర్, బుచ్చన్న యాదవ్, గిరి, స్వామి, మల్లయ్య, రాజేశ్వర్, కిషన్ తదితరులు ఉన్నారు.

కడెం: మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ సేవలు మరువలేనివని బీజేపీ మండలాధ్యక్షుడు కాశవేని శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఆయన ప్రథమ వర్ధంతి సందర్భంగా కడెంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఇందులో బీజేపీ నాయకులు ధర్మాజీ కిష్టయ్య, రాపర్తి శ్రీనివాస్, శ్రీరాం, పాలకుర్తి నగేశ్, తదితరులున్నారు.



ఖానాపూర్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

కన్యకాపరమేశ్వరీ ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

సోన్: ఆషాఢమాసం నేపథ్యంలో మండలంలోని సాకేర వాసవీ కన్యకా పరమేశ్వర ఆలయంలో ఆదివారం బోనాల జాతర నిర్వహించారు. ఈసందర్భంగా మహాలక్ష్మి అమ్మవారికి బోనాలను నైవేద్యంగా సమర్పించారు. అమ్మవారి ఆలయములో అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మెహందీ, ఆటలపాట పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఆమెడ కిషన్, ఆమెడ అర్చణ, కమలేశ్వరి, పుల్లూరి రాజకిషన్, ఆర్యవైశ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఊరడి పండుగ

లోకేశ్వరం: మండలంలోని రాజూర గ్రామంలో ఆదివారం ఊరడి పండుగ నిర్వహించారు. ముత్యాలమ్మ, మహాలక్ష్మి ఆలయం వద్దకు గ్రామస్తులు ఊరేగింపుగా వచ్చి పూజలు చేశారు. అనంతరం సమీపంలోని గోదావరి జలాలను తీసుకొచ్చి గ్రామదేవతలకు అభిషేకం చేశారు.

వర్షం కోసం పూజలు



ధర్మోరలో ఆలయానికి వెళ్తున్న భక్తులు

లోకేశ్వరం: మండలంలోని పుస్పూర్, ధర్మోరా, పంచగుడి, గొడిసెరా, కన్కపూర్, రాజూర తదితర గ్రామాల్లోని ఆరెల్లి మైసమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదావరి జలాలను తీసుకొచ్చి గ్రామదేవతలకు అభిషేకం చేశారు. ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రామారావు

ముథోల్: వర్షాలు కురువాలని మండలకేంద్రంలో ఆదివారం ఆయా కులాల సంఘాల ఆధ్వర్యంలో గ్రామదేవతలకు బోనాలను నైవేద్యంగా సమర్పించారు. ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ పాల్గొని పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పరామర్శ

కుంటాల: మండలంలోని విఠాపూర్ గ్రామంలో విశ్రాంత ఉపాధ్యాయుడు గణపతిరావు పటేల్ భార్య ఆదివారం గుండెపోటుతో మృతిచెందగా బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పరామర్శించారు. ఆయన వెంట లింగురాం పటేల్, లింగారెడ్డి, విఠల్‌రావు పటేల్, సీహెచ్ రవి, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మ చైర్మన్లకు సన్మానం

భైంసాటౌన్: పట్టణంలోని ఏపీనగర్‌లో ఆదివారం ముథోల్, భైంసా ఆత్మ చైర్మన్లుగా ఎన్నికైన గన్ను నర్సారెడ్డి, సిద్ధం వివేకానందను కాలనీవాసులు శాలువా, పూలమాలతో సన్మానించారు. అనంతరం లయన్స్ క్లబ్ భైంసా డైమండ్ అధ్యక్షుడిగా ఎన్నికైన మోహన్‌రావును సన్మానించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చందులాల్, మాజీ సర్పంచ్‌లు సంజీవరెడ్డి, మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు శంకర్ చంద్రే, రాజేశ్వర్, ఆశమొల్ల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మూడు గేదెలు మృత్యువాత

- తెగిపడిన కరెంట్ తీగలు తగలడంతో ఘటన



గేదెల కళేబరాలు పరిశీలిస్తున్న రైతులు

కడెం: మండలంలోని సారంగాపూర్ గ్రామానికి చెందిన కోల శ్రీనివాస్, చేపూరి నర్సయ్య, కోల లచ్చన్న అనే పాడి రైతులకు చెందిన మూడు గేదెలు విద్యుదాఘాతంతో మృతి చెందాయి. ఆదివారం మేత కోసం గ్రామశివారుకు వెళ్లగా ప్రమాదవశాత్తు పంట పొలాల్లో తెగి పడిన త్రీఫేజ్ విద్యుత్ తీగలకు తగిలి అక్కడికక్కడే మృతి చెందాయి. ఒక్కో గేదె విలువ రూ.యాభై వేలు ఉంటుందని.. నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధిత రైతులు వేడుకున్నారు.

ఘనంగా ఆషాఢ బోనాలు



నిర్మల్‌లో ఏ.ఎం.ఆర్ టవర్స్ వద్ద భక్తులు



కుంటాల: వెంకూర్ పెద్దమ్మతల్లి ఆలయం వద్ద..

నిర్మల్‌టౌన్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పండుగను ఆదివారం జిల్లాకేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఏఎన్ రెడ్డి కాలనీలో ఏఎంఆర్ టవర్స్‌లోని మహిళలు మారెమ్మ ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.

ముథోల్: మండలకేంద్రంలో ఆదివారం ఆయా కులసంఘాల ఆధ్వర్యంలో గ్రామదేవతలకు బోనాలను నైవేద్యంగా సమర్పించారు. కొత్త కుండల్లో నైవేద్యాలు వండి దొంతులతో మహిళలు మంగహారతులతో మహాలక్ష్మీ, దగ్గులవ్వ, ముత్యాలమ్మ ఆలయాలకు వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. మహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలో ఎమ్మెల్యే రామరావుపటేల్ ప్రత్యేక పూజలు చేశారు.

ఖానాపూర్: మండలంలోని మేడంపల్లి గ్రామంలో సదరు బోనాల పండుగ నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి బోనం ఎత్తుకొని శివారులోని రేండ్ల పోచమ్మకు నైవేద్యం సమర్పించారు. ఊరేగింపులో పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుగ్లావత్ రాజేందర్‌నాయక్, మాజీ జెడ్పీటీసీ రామునాయక్, సత్యనారాయణ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్‌చైన్‌గేట్: పట్టణంలోని నాయుడువాడకు చెందిన మున్నూరుకాపు, ముదిరాజ్ కులస్తులు నల్లమేకల పండుగ నిర్వహించారు. ఈసందర్భంగా భూలక్ష్మి మాతకు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. లింగన్న, గంగాధర్, సాదం అరవింద్, రమేశ్, కృష్ణ రాములు పాల్గొన్నారు.

నల్లమేకల పండుగ

నర్సాపూర్(జి): మండలకేంద్రంలో ఆదివారం నల్లమేకల పండుగను గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు డప్పు వాయిద్యాల నడుమ గోదావరి జలాలను తీసుకొచ్చి గ్రామదేవతలకు అభిషేకం చేశారు. అనంతరం బోనాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

పెద్దమ్మ తల్లికి బోనాలు

కుంటాల: మండలంలోని వెంకూర్ పెద్దమ్మతల్లి ఆలయంలో బోనాలను నైవేద్యంగా సమర్పించారు. వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని కోరుకుంటూ అమ్మవారికి పూజలు నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో గ్రామదేవతలకు నైవేద్యం సమర్పించి పూజలు చేశారు.

ఘనంగా భీమన్న పండుగ

కుంటాల: మండలంలోని లింబా(కె) గ్రామంలో ఆదివారం ముదిరాజ్ సంఘ సభ్యుల ఆధ్వర్యంలో భీమన్న పండుగ నిర్వహించారు. భీమన్న గజాల (శూలలు)కు వండిన వంటకాలను నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.



ముథోల్‌లో బోనాలతో భక్తులు



ఖానాపూర్: మేడంపల్లిలో బోనాలతో భక్తులు